# ఇది ఒకనాటిమాట కాదు

మందాకిని అప్పుడే ఇంటికి వచ్చింది. విసుగ్గా కుర్చీ లాక్కుని కూర్చుంది. ఇంటినుంచి బయలుదేరినప్పటి ఉత్సాహంగాని, చురుకుదనం గాని, ధైర్యంగాని, ఇప్పుడామెలో లేవు. కాగా అహం దెబ్బతిన్నట్టు ముఖంలో స్పష్టంగా కనబడుతోంది.

"అమ్మగారూ. కాఫీ తీసుకురమ్మంటారా ? డ్రింకు తెమ్మంటారా ?" అని వంటమనిషి అడిగాడు. "నాకిప్పుడేమీ వద్దు" విదిలించి కొట్టినట్టుగా మాట్లాడింది.

ఆమె సాధారణంగా ఆఫీసునుంచి రాగానే వేడి వేడి కాఫీ అయినా చల్లగా మంచు గడ్డలు తేలుతున్న డ్రింకు అయినా తీసుకుంటుంది.

"అమ్మగారికి ఆరోగ్యం సరిగాలేదో, మనసు బాగాలేదో ?" అనుకున్నాడు. పిల్లలు స్కూళ్లనుంచి రాగానే పిలిచి దగ్గర కూర్చోబెట్టుకుని, స్కూలుసంగతులు అడిగి, వాళ్ళచేత చెప్పించుకుని, ముద్దులు పెట్టుకుని, "బాగా చదువుకోండి. పరీక్షలలో మంచి మార్కులు రావాలి'' అనేది.

ఆనాడటువంటి వేమీ జరగ లేదు.

ఆమె ఒంటరిగా కుర్చీలో కూర్చుని, ఏదో ఆలోచిస్తూ ముఖమట్లా పెట్టిందని పిల్లలు కూడా గ్రహించుకున్నారు. దూర దూరంగా తిరుగుతూ వేళకు భోజనంచేసి పడుకున్నారు.

"ఆ నరసింగరావు ఇంతమాట అంటాడా ? ఎంత ధైర్యం.?"

ఆ కుర్చీలో ఆమె అట్లా కూర్చుని కళ్లు మూసుకుని కొంతసేపూ, కళ్ళు తెరిచి కొంతసేపూ, ఏదో ఆలోచిస్తూ ఇంటి కప్పుకేసి చూడటం మొదలు పెట్టింది.

ఆమె ఆ ఊరు బదిలీ అయి వచ్చిన తరువాత పిల్లలపనులు చూడటానికి

ఇంటి పనులు చేయటానికి ఒక నౌకరు కుదిరాడు. చెప్పిన పనులు వేళకు చేస్తున్నాడు. ఆడ నౌకరు అంట్లూ బట్టలపని చేస్తుంది. అతడు బట్టలు ఇస్త్రీచేసి వంటయింట్లో సామానంతా సర్ది వంటచేస్తాడు. పిల్లలకు టిఫిన్‌డబ్బాలు అందించటం, ఆమెకు ఆఫీసుకు భోజనం తీసుకువెళ్లటం అంతా అతడి బాధ్యతే. అతడిపేరే సుబ్బయ్య. అతడే తల్లీ పిల్లలను కాపాడే ఇంటికి పెద్దగా మసులుకుంటాడు.

ఆమె రెండు నెలల క్రిందట డి.ఇ.వో గా బదిలీ అయి ఆ ఊరువచ్చింది. మొదటి రోజు ఆఫీసు స్టాఫంతా ఎవరికి వారు వచ్చి పరిచయం చేసుకున్నారు. అందరూ చాలా మర్యాదగా మాట్లాడేరు. కొన్ని రోజులు ఆ ఊరికీ ఆఫీసుకీ ఆమె తన అదృష్టం కొద్దీ ట్రాన్స్ఫరయి వచ్చానని సంతోషించింది.

కాని- ఒకస్త్రీ అధికారిణిగా వస్తే స్టాఫ్, వాళ్లల్లో వాళ్ళు ఆమె ముఖం చాటు కాగానే ఆమె జీవిత విశేషాలను గురించి పరిశోధన చేయటం మొదలుపెడతారు. అదే పురుషుడు అధికారిగా వస్తే ఇంతచేటు ఆలోచనా పరిశోధనా ఉండవు. కాని, క్రమంగా ఆయనలోని బలహీనతలను వెతికి, వెలికి తీసి ఉపయోగించుకుంటారు. ఇది అన్నివేళలా, అందరిదగ్గరా సాగిరాదు ఇది ఒకనాటి మాటకాదు. ఏదో ఒక రూపంలో అనంతంగా ఉండేది.

ఆ కుర్చీలో ఆమె అట్లా కూర్చుని ఇంటి కప్పు కేసి చూస్తూ ఆలోచిస్తున్నదంటే ఆమె గుండె ఎంత మండిపోతున్నదో నని సుబ్బయ్య ఆందోళన పడుతున్నాడు.

ఆమె ఎం.ఏ; ఎం ఎడ్, సర్వీసులో అంచెలంచెలుగా పైకి మెట్లెక్కినట్లు ఎక్కుతూ వచ్చింది. ఆ రావటం కొంత తొందరగా వచ్చింది.

ఒకనాడు సుబ్బయ్య ఆమెకు భోజనం తీసుకు వచ్చినప్పుడు "ఆమెకు పెళ్ళయిందా ?" అని ఎవరో ప్రశ్నించారట.

"మీ కెందుకామె ఊసు ?" గొణుక్కుని-

"ముగ్గురు పిల్లలు. ఇద్దరబ్బాయిలు ఒక అమ్మాయి" అని చెప్పానన్నాడు సుబ్బయ్య- ఆమెతో.

మరి నాలుగురోజుల తరువాత "మీ అయ్యగారు ఏ ఊళ్లో ఉంటారు ?"

రెండో ప్రశ్న ఎదురయింది, సుబ్బయ్యకు. "అబ్బబ్బ! ఈళ్లకెందుకామె ఊసు?" మళ్ళీ గొణుక్కున్నాడు.

"ఇక్కడ అమ్మగారూ పిల్లలూ ఉంటారండి." సుబ్బయ్య మామూలుగా ప్రశ్నలకు జవాబులిస్తూ పోతున్నాడు.

"అయితే ఆయనెక్కడుంటారో తెలుసా?"

''అవన్నీ నాకు తెలియవండి. నేను నౌకర్నండి. ఆయమ్మ చెప్పినపనులు చేస్తాను. మంచి వారండి'' అన్నాడు.

ఇకపోతే వాళ్లకు 'ఆయన ఏంచేస్తాడు? ఎక్కడుంటాడు?' ఈ ప్రశ్నలకు జవాబులుకావాలి. ఇది నౌకరువల్ల తెలిసే ప్రశ్నలు కావు. ఈ రెండు ముళ్లూ విప్పాలి, ఎట్లా అన్న ఆలోచనలో పడ్డారు.

స్టాఫ్‌లో తీరిక సమయాలల్లో కొందరి తలల్లో గిరగిరా తిరిగే తరగని ప్రశ్నలు.

''విడిచి పెట్టేడేమో?''

''వేరే పెళ్ళి చేసుకున్నాడేమో?"

''అయినా అసలు ఈమె ఎటువంటిదో?''

ఈ శతాబ్దం చివరికి వచ్చినా స్త్రీని గురించిన ఇటువంటి ప్రశ్నలు మగవాళ్లను వదలిపెట్టటంలేదు. ఇంకో శతాబ్దం వచ్చినా ఈ ప్రశ్నలు అంతరించవు. ఇలా సాగుతూనే ఉంటాయి.

"ఆయన చచ్చిపోయాడేమో?"

''ఆయన పోయినట్లయితే ఆమె వేషం వేసుకుని ఉద్యోగం చేస్తోంది నిశ్చింతగా?''

"ఈమె ఈ వయసులో డి ఇ.వో అయిందా? డైరెక్టు రిక్రూట్‌మెంటేమో? ఎవరైనా మెచ్చి చేశారేమో?"

ఈ ప్రశ్న ఆమెవరకూ వచ్చింది. ఎవరీ ప్రశ్న వేసిందీకూడా తెలిసింది.

మందాకిని వచ్చినతరువాత ఆఫీసుపనులు మొదలు చురుకుగానే సాగాయి.

తరువాతనే స్టాఫ్ కందరికీ ఈ రకం ఆలోచనలతో వాళ్లవృత్తి బాధ్యతలను మరిచి పోయి, ఆమెను గురించిన పరిశోధనలలో మునిగిపోయారు.

ఆమె ఒకరోజున ప్యూన్‌తో టైపిస్టును పిలుచుకురమ్మని చెప్పింది.

ప్యూన్ టైపిస్టుకోసం ఆఫీసు గదులన్నీ వెదకవలసి వచ్చింది. పావుగంట తరువాత "లేరండి. వేరేపనిమీద బైటకి వెళ్లారట" అని చెప్పాడు.

ఒక గుమస్తాను పిలిచి "ఈ మాధవరావుగారిని గురించిన ఫైలును తీసుకు రండి" అన్నది.

''అంత అర్జంటా? ఫైళ్లన్నీ వెతకాల్సి ఉంటుంది. ఈ లోపల ఆఫీసుటైము అయిపోతుందండి'' అన్నాడు.

"ఆ ఫైలు చాలా అర్జంటు. మీరాఫైలు తీసుకువచ్చేవరకూ నేను ఆఫీసు లోనే ఉంటాను" అన్నది.

ఈ గుమస్తావెళ్లిన అరగంటకు ఫైల్సు భద్రపరచే గుమస్తావచ్చి "అది చాలా రోజులనాటి ఫైలండి. అది అంతఅవసరమైన ఫైలుకాదని ఆ మూల అలమారీలో పెట్టాడండి. అవన్నీ తీసి కిందపడేసి వెతకాలండి. అందుకు కనీసం రెండు రోజులయినా పడుతుంది" అన్నాడు. అతడు ఆఫీసురూమ్‌లోకి వచ్చేటప్పుడే ఠీవిగా తానొక ఆఫీసరుగా వచ్చాడు.

"ఈఫైలు చాలా రోజులనాటి ఫైలా? అవసరంలేని ఫైలని దాన్ని మూలగా ఉన్న అలమారీలో పడేశారా? ఎంతకాలమైంది అలా పడేసిపెట్టి?"

అతడు ఆలోచిస్తున్నాడు ఏంచెప్పాలా అని.

ఆమె ఇంకలాభంలేదని ఫైల్ సంగతి తనకు తెలిసినట్టుగా చెప్పింది. 'మాధవరావుగారనే ఉద్యోగి గతంలో జబ్బుపడి ఏడాదిసెలవు పెట్టాడు. ఆయనకు జబ్బు తగ్గిన తరువాత-ఆ ఏడాది సెలవూ శాంక్షన్‌చేసి, తనకు జీతం ఇప్పించమని పది నెలలనుండీ దరఖాస్తులు పెట్టుకుంటున్నాడు. తన దరఖాస్తులను ఎవరూ పట్టించుకోవటంలేదని, తనకు సెలవు మంజూరుచేయించి ఆ సెలవుజీతం ఇప్పించ మని మరొక దరఖాస్తు పెట్టుకున్నాడు. అయన మళ్లీ వారంక్రిందట దరఖాస్తు లన్నీ ఏమయ్యాయి? అసలాఫైలు పనికిరాదని మూలపడెయ్యమని మీ కెవరయినా

చెప్పారా? నాకు ఎట్లాగయినాసరే మీలో నలుగురు అన్ని పనులూ పక్కకు పెట్టి, ఆ ఫైలు వెదకితెచ్చి, నా బల్లమీద పెట్టండి. అది చాలా అర్జంటు ఫైల్" అని ఆమె ఖండితంగా చెప్పి, తన పని పూర్తి చేసుకుని ఆఫీసు రూంలోనుంచి బైటకి వస్తున్నది.

సరిగా ఆ సమయంలో నరసింగరావనే గుమస్తా "ఆ మాధవరావు మీద ఈమెకేమి ఇంట్రస్టు? స్నేహితుడా? బంధువా? ప్రియుడా? 'ఫైల్-ఫైల్' అంటు ప్రాణం తీస్తున్నది?'' అనటం వినబడ్డది. ఆ కంఠ ధ్వనిని ఆమె బాగా గుర్తు పట్టగలదు.

"పిలిస్తే సీటుమీదినుంచి లేచిరారు. పంపించిన ప్యూనుకూడా అక్కడే ఉండిపోతాడు. అతడిని రానివ్వరు అనుకుంది.

మరునాడంతా, ఆమె ఆ ఫైల్ తెచ్చి బల్లమీద పెడతారేమోనని చూసింది.

ఫైలు రాలేదు.

ఆమె గంటకొట్టి ప్యూన్ని పిలిచింది. అతడు రాగానే "నిన్న నరసింగరావు గారిని ఒక ఫైలు తెచ్చి నా బల్లమీద పెట్టమన్నాను. ఫైలు ఇంకారాలేదు. తీసుకు రమ్మని చెప్పు?'' అని పంపించింది.

"ఆయన ఈపూట రాలేదటండీ?'' అన్నాడు.

''విశ్వనాథరావుగారిని తెమ్మని చెప్పు?''

వెళ్లిన ప్యూను మళ్లీ ఆఫీసు రూమ్‌లోకి రాలేదు.

ఆఫీసు టైమయ్యేవరకూ ప్యూన్‌కూడా తన రూమ్‌లోకి రాడేమోనని ఆమె స్వయంగా వచ్చింది.

ఆమె గదిలో అడుగుపెట్టగానే ఇద్దరు గుమాస్తాలు వెతుకుతున్నట్టుగా ఫైళ్లన్నీతీసి కిందపడేసి వెతకటం మొదలు పెట్టారు.

''దొరికిందా ఫైలు?'' ఆమె కొంచెం గట్టిగానే అడిగింది.

''దొరకలేదు'' అన్నారు.

వాళ్లకు ఇంతకాలంనుంచీ ఆఫీసర్ని-సర్' అనటం అలవాటు. పిలవగానే

వెళ్లటం ఆయన చెప్పినపని భయభక్తులతో చేయటం ఆనవాయితీ. టైపిస్టును ఉత్తరాలు డిక్టేట్ చెయ్యాలి రమ్మనగానే హాజరయ్యేవాడు.

కాని-ఇప్పుడు పరిస్థితి మారింది. ఒక స్త్రీ ఆఫీసరుగా వచ్చింది. ఆమెను మేడమ్ అనడానికి వాళ్లకు నోరు రావటంలేదు. ఇంటిమనిషి ఏదైనా పనిచెప్తే రేపు చేస్తాలే' అన్నట్టు నిర్భయంగా ఆఫీసు పనులు చేస్తున్నారు. తనెన్ని ఊళ్ల ల్లోనో పనిచేసింది. కానీ ఈ ఊర్లో ఇట్లు ఎందుకు జరుగుతున్నది? ఇది మంచి ఊరని వేశారూ ఎంతమంది స్త్రీలు ఆఫీసర్లుగా పనిచేయటంలేదు? ఏం మనుష్యులు వీళ్లు? ఇది ఏమనుకుంటున్నారు ?

మందాకిని చాలా ఓపికతో ఆఫీసులో పనిచేయాలని ఎంత ప్రయత్నించినా వాళ్లు సాగనివ్వటంలేదని గ్రహించింది.

''మీరు ముగ్గురూ ఆఫీసు రూమ్‌కి రండ''ని చెప్పి తనరూమ్‌లోకి వెళ్ళి పోయింది.

ముగ్గురూ ఏమనుకున్నారోగాని ఆమెగదిలోకి వచ్చి నిలబడ్డారు.

"మీకు ఫైళ్ళు మెంటైన్ చేయటం చేతకాదని ఇప్పుడు అర్థమైంది. మీ సర్వీసెంత ? చెప్పండి. ఒక్కొక్కళ్ళకు ఇంకా ఎంత సర్వీసుంది ?" గంభీరంగా ఉన్నదామెగొంతు.

"పది సంవత్సరాలకుపైగా ఉంది.''

"మీరు ఫైళ్ళను బల్లమీదికి వేళకు పంపకుండానే ఇంతకాలం పనిచేశారా ? అతడు ఏడాది నుంచీ వ్రాస్తున్న ఉత్తరాలేమయ్యాయి ? అతడికి సెలవు శాంక్షను కావాలంటే ఫైల్ దొరకాలి. ఫైల్ దొరికితేగాని సెలవు శాంక్షన్ కాదు. శాంక్షను అయితే జీతం అతడికి వస్తుంది. ఆ ఫైల్ దొరికేవరకూ మీ జీతాలు ఆపి పెట్టిస్తాను. మీకు ఆఫీసు పనిమీద శ్రద్ధలేదు. సాటి ఉద్యోగిమీద సానుభూతి లేదు. ఇటువంటి అవసరం ఎవరికయినా రావచ్చు. మీకూ రావచ్చు. నాకూ రావచ్చు. ఫైల్‌దొరకలేదని సాకుతో సెలవు శాంక్షను కాలేదని జీతం ఆగిపోతే మీకెట్లా ఉంటుంది ? మీకు ఇంకొకరోజు టైమిస్తున్నాను. అప్పటికీ దొరక్కపోతే ఏక్షను తీసుకుంటాను. వెళ్ళండి'' అన్నది.

ముగ్గురూ మాట్లాడకుండా వెళ్ళిపోయారు.

ఆఫీసు టైము కాగానే మందాకిని ఇంటికి వచ్చింది.

స్టాఫంతా ఆఫీసులో కూర్చుని ఆఫీసరుమీద అశ్లీలమైన నేరాలు మోపి, ''ఆమె చేతికింద పనిచేయలేక పోతున్నామ''ని ఒక పిటిషన్ తయారుచేసి ప్యూన్లతో సహా అందరూ సంతకాలు పెట్టారు. డైరక్టరికి ఒకనాడు పంపించారు. ఇది చేరేలోపల మందాకిని డైరక్టరికి ఫోన్‌చేసి ''పనిచెయ్యకుండా స్టాఫంతా ఎదురు తిరుగుతున్నారనీ తను ఏపనీ చేయలేకపోతున్నదనీ స్టాప్‌నైనా తననైనా మార్చవలసిందిగా వివరించి చెప్పింది.

డైరక్టరు ఒక ఆఫీసర్ని వెంటనే ఇన్‌స్పెక్షన్‌కి పంపించినట్టుగా పంపించాడు. ఆయన తనచేతి క్రిందివాళ్ళనిద్దరిని కూడా తీసుకు వచ్చాడు.

ముందు మందాకిని ఆఫీసురూమ్‌కి వెళ్ళాడు.

ఆమె ఆయనను చూడగానే లేచి నమస్కారంచేసి కుర్చోమని కుర్చీ చూపించింది. ఆయన అసలు విషయమేమిటని అడగగానే - తను వచ్చినప్పటి నుంచీ స్టాఫ్ ప్రవర్తన - వారిలో కొందరు తన జీవిత విశేషాలమీద పరిశోధన చేయటం ఫైల్సు తీసుకు రమ్మంటే దొరకలేదని అందరూ ఒకేమాటను రోజుల పర్యంతం చెప్పి తప్పించుకోవటం, వగైరా విషయాలన్నిచెప్పి, తనను గురించి అశ్లీలంగా కూడా వాళ్ళల్లో వాళ్ల ఆఫీసులో మాట్లాడుకోవటం తనువిన్నదనీ తనకు వాళ్ళచేత పనిచేయించటం చాలాకష్టంగా ఉందని" చెప్పింది.

ఆ అధికారి వాళ్ళచేతనే ఆఫైలు వెతికించాడు. అది నరసింగరావు డ్రాయరులోనే దొరికింది. ఆయన రెండురోజులుండి వెళ్ళిపోయాడు.

వారం రోజులు నిండకుండానే మందాకినికి మరో ఊరికి ట్రాన్స్ఫరు ఆర్డర్లు వచ్చాయి. స్టాఫులో నలుగురికి ఇంక్రిమెంట్లు ఆగిపోయాయి. స్టాఫ్‌చేత నిలబెట్టి పనిచేయించే డి. ఇ. వోను ఆ ఊరికి ట్రాన్స్ఫరుచేశారు.

సుబ్బయ్య మాత్రం ''అమ్మగారూ. వాళ్లనోళ్లు ఇంక మూతబడతాయి. ఇప్పుడు వచ్చే డి.ఇ.వో గారు ఇదివరకూ ఇక్కడ ఉండి పోయినవారే. ఆయన దగ్గర వాళ్లందరూ ఒణుకుతూ పనిచేసినవాళ్లే. ఆర్డరుచూసి ఏడుపు ముఖాలు పెట్టారు'' అన్నాడు.

"''వాళ్లు ఏమన్నాగానీ-సామాన్లుసర్ది లారీమాట్లాడు. పిల్లలు తండ్రిని చూడా

లంటున్నారు. ముందు అక్కడికివెళ్లి వారం రోజులుండి డ్యూటీలో జాయనవు తాను'' అన్నది మందాకిని.

''అమ్మగారూ! అయితే అయ్యగారు ఏ ఊళ్లోఉన్నారు? నేనుపిల్లలకు బాగా అలవాటయ్యాను. నన్నుకూడా తీసుకెళ్ళండమ్మగారూ. ఇక్కడ చేస్తున్న పనే అక్కడచేస్తాను. బాబులను చూడకుండా ఉండలేనమ్మగారూ'' అన్నాడు రుద్ధ కంఠంతో.

''అదేంమాట? నీ కుటుంబాల్ని వదలిపెట్టి మాతో ఎట్లావస్తావు?"

''నాకు కుటుంబం లేదమ్మగారూ. నేను ఎంతమంది దగ్గరో పనిచేశాను గాని ఇటువంటి నౌకరీ నాకింతవరకూ దొరకలేదమ్మగారూ. మీ పిల్లలతో సమానంగా నన్ను చూశారు. ఇంత దయగల తల్లినీ పిల్లలనూ వదలిపెట్టి ఉండలేనమ్మగారూ'' అని కళ్ళనీళ్లు పెట్టుకున్నాడు.

"సరే" రా. ఈ ఊళ్లో నేను ఆఫీసులో చెడ్డపేరు తెచ్చుకున్నాను. కాని ఒక మంచి నౌకర్ని సంపాదించుకుని వెళ్తున్నాననుకుంటాను" అన్నది మందాకిని. ఆమెకు తలమీదినుంచి పెద్ద బరువు దిగిపోయినట్టుగా హాయిగా గాలిపీల్చుకుంది. ఆ రోజున కడుపునిండా భోజనంచేసి కంటినిండా నిద్రపోయింది.

❋❋